తెగితేనే పట్టించుకుంటారా?

- కోతకు గురైన ఎల్లాగ్‌రంగంపేట చెరువు కట్ట
- పొంచి ఉన్న ప్రమాదం
- స్పందించని ఇరిగేషన్ శాఖ అధికారులు



చెరువు కట్టపై ప్రమాదకరంగా మారిన గొయ్యి

సంగెం: అధికారుల అలసత్వం రైతులు, మత్స్యకారులు, ప్రయాణికులకు శాపంగా మారుతోంది. మండలంలోనే అతిపెద్ద ఆయకట్టు కలిగిన ఎల్లాగ్‌రంగంపేట చెరువు కట్టకు ప్రమాదం పొంచి ఉంది. మండలంలో ఏప్రిల్ 30న రాత్రి కురిసిన వర్షానికి ఎల్లాగ్‌రంగంపేట చెరువు కట్ట ఏనుగుండ్ల సమీపంలోని మలుపు వద్ద కట్టకు బయటి వైపు కోతకు గురై భారీ బుంగ పడింది. సుమారు 20ఫీట్ల లోతుగా కట్ట కోతకు గురికావడంతో రైతులు, మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. రెండు నెలలు గడుస్తున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొద్దిపాటి వానకే కట్టకోతకు గురైతే వచ్చే వానాకాలంలో భారీ వర్షాలు కురిస్తే కట్ట పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు. కాగా, కోతకు గురైన చోటనే గతంలో చాలా ఏళ్లక్రితం చెరువు కట్టకు బుంగపడిందని స్థానికులు తెలుపుతున్నారు. మిషన్ కాకతీయ చివరి విడతలో చేపట్టిన పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించకుండా నిర్లక్ష్యంగా పనులు చేయడంతో ఇటీవల జాలు తూము షట్టర్ కూడా ధ్వంసం అయిందని, ఇప్పుడు కట్టకోతకు గురైందని రైతులు అధికారులు, కాంట్రాక్టర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే మూల మలుపు ఆపై గొయ్యి వాహనదారులకు సైతం ప్రమాదం పొంచి ఉంది. వేసవిలో కురిసిన అకాల వర్షానికే చెరువు కట్టకోతకు గురైందని, ఇప్పుడు వానాకాలంలో భారీ వర్షాలకు కట్టపై భారీ గొయ్యి ఏర్పడిందని మరింత కోతకు గురైతే చెరువు కట్ట తెగిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కట్టకు మరమ్మతులు చేపట్టి చెరువు వానకాలంలో తెగకుండా చర్యలు తీసుకోవాలని రైతులు, మత్స్యకారులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మరమ్మతు చేపట్టాలి



చెరువుకట్టపై వేసవిలో కురిసిన వర్షపు నీటి వరదతో భారీ గొయ్యి ఏర్పడింది. గొయ్యి ఏర్పడి రెండు నెలలు గడిచినా.. అధికారులు పట్టించుకోవడం లేదు. వానకాలంలో భారీ వానలకు వచ్చే వరదతో కట్టకు ప్రమాదం పొంచి ఉంది. గొయ్యి పూడ్చి చెరువు కట్ట తెగకుండా చర్యలు తీసుకోవాలి.

– బోనాల భగత్, ఎఫ్‌సీఎస్ చైర్మన్, ఎల్లాగ్‌రంగంపేట

గొయ్యి పూడ్చివేయిస్తాం..

చెరువు కట్టకు గొయ్యి పడినట్లు మా దృష్టికి వచ్చింది. పూడ్చమని గతంలో సర్పంచ్‌కు చెప్పాం. కానీ, పూడ్చలేదు. రెండు, మూడు రోజుల్లో పూడ్చివేయించి సమస్య పరిష్కరిస్తాం.

– హమీద్, ఇరిగేషన్ ఏఈ, సంగెం

జీపీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న జీపీ సిబ్బంది

నర్సంపేట రూరల్ : గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న జీపీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక, సంఘాల జేఏసీ చైర్మన్ పాలడుగ భాస్కర్, సెక్రటరీ నారాయణ, కోశాధికారి సదానందం డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులకు జీఓ నంబర్ 60ప్రకారం వేతనాల పెంపు, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు, కారోబార్, బిల్‌కలెక్టర్‌ను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఐడీ యాక్ట్–1947 సెక్షన్ 22ను సవరించాలని డిమాండ్ చేశారు. లేని ఎడల జూలై 6న సమ్మె చేపడతామని నర్సంపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓ సునీల్ కుమార్ రాజ్‌కు, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై బొజ్జ రవీందర్‌కు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని గురిజాల జిల్లా పరిషత్ సెంకడరీ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్ సర్పంచ్ గొడిశాల మమత మంగళవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందన్నారు. విద్యార్థులకు అన్ని రకాల వసతులను కల్పించామన్నారు. ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ రాములు, ప్రధానోపాధ్యాయుడు గుడిపూడి రాంచందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితులు పాల్గొన్నారు.

ఖాదర్‌పేట ప్రాథమిక పాఠశాలలో..



చెన్నారావుపేట : మండలంలోని ఖాదర్‌పేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు మంగళవారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కట్టస్వామి మాట్లాడుతూ ఉపాధ్యాయులు.. విద్యార్థుల అవసరాలను గుర్తించి సొంత ఖర్చుతో నోట్‌బుక్స్, పలకలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వరంగంటి వెంకటేశ్వర్లు, శ్యాంసుందర్, ఉమాశంకర్, నర్సయ్య ఉన్నారు.

నోట్‌బుక్స్ అందించిన ఎన్‌ఆర్‌ఐ

రాయపర్తి : మండలంలోని గట్టికల్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ ముక్కాల వెంకటరమణ నోట్‌బుక్స్‌ను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్నాల వనజలక్ష్మీనారాయణ, ఎస్‌ఎంసీ చైర్మన్ లింగయ్య, హెచ్‌ఎం మల్లేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొడ్డుచింతలపెల్లి ప్రభుత్వ పాఠశాలలో..

గీసుకొండ : మండలంలోని బొడ్డుచింతలపెల్లి ప్రభుత్వ పాఠశాలలో టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేదాసి మోహన్ సొంత ఖర్చుతో మంగళవారం విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. సర్పంచ్ కేదాసి అనిల్, పంచాయతీ కార్యదర్శి యాదలక్ష్మి, హెచ్‌ఎం, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్విజ్ పోటీలో పాల్గొనాలి



ఆన్‌లైన్ నమోదును ప్రారంభిస్తున్న సౌజన్య

నల్లబెల్లి : హైదరాబాద్ డిక్లరేషన్ స్ఫూర్తిగా టీపీసీసీ ఆధ్వర్యంలో జూలై 2న నిర్వహించనున్న రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను విజయవంతం చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీమగొని సౌజన్య కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆన్‌లైన్ కాంపిటీషన్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ పోటీల్లో గెలిచేందుకు అవసరమైన టిప్స్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు పార్టీ కార్యకర్తలు, నాయకులు హైదరాబాద్ డిక్లరేషన్‌ను విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ పోటీలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. సమావేశంలో చిట్యాల తిరుపతి రెడ్డి, వైనాల అశోక్, ఇస్తారి శేఖర్ గౌడ్, చార్ల శివారెడ్డి, పెంతల కొంరారెడ్డి, జ్యోతి, పురుషోత్తం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు



తలకొరివి పెడుతున్న కుమార్తె సౌమ్య

నల్లబెల్లి : మండలంలోని నారక్కపేట గ్రామానికి చెందిన వైనాల రాజు(40) బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు 10ఏళ్ల క్రితం కుటుంబ సభ్యులతో వలస వెళ్లాడు. కాగా రాజు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకవచ్చి దహన సంస్కారాలు చేపట్టగా.. రాజుకు కుమారులు లేరు. ఇద్దరు కుమార్తెలు సౌమ్య, రమ్య ఉన్నారు. దీంతో పెద్ద కూతురు సౌమ్య కుండపట్టి తండ్రికి తలకొరివి పెట్టింది. మృతుడికి భార్య మాధవి ఉన్నారు.

మాదిగలంతా చైతన్యవంతులు కావాలి

దుగ్గొండి: ఎస్సీ వర్గీకరణ కోసం జరుగుతున్న పోరాటంలో మాదిగలంతా చైతన్యం కావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ కట్ల రాజశేఖర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ కోసం 29 ఏళ్లుగా జరుగుతున్న పోరాటం తుది దశకు చేరుకుందన్నారు. వర్గీకరణలో కేంద్రం చేస్తున్న నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించబోయే సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. సమావేశంలో మంద రాజు, పర్లపెల్లి బాబు, కొలగాని రవి, పర్లపెల్లి వంశీకృష్ణ, దీపక్, వంశీ, పవన్, రాజు, కృష్ణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ‘చల్లా’ ప్రమేయం లేదు

- పూర్వీకుల నుంచి ఆ భూమి మాదే..



మాట్లాడుతున్న సోదరులు

గీసుకొండ: మండలంలోని విశ్వనాథపురం రెవెన్యూ పరిధిలో పూర్వీకుల కాలం నుంచి సాగు చేస్తున్న భూమి తమదే అని, ఈ విషయంలో ఏర్పడిన వివాదంతో పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి ఎలాంటి సంబంధం లేదని బాధిత అన్నదమ్ములైన రైతులు అంగోత్ శ్రవన్‌కుమార్, స్వామిలు స్పష్టం చేశారు. మంగళవారం విశ్వనాథపురం రెవెన్యూ పరిధిలో వివాదం నెలకొన్న వ్యవసాయ భూమి వద్ద వారు విలేకర్లకు తమ గోడును వెల్లబోసుకున్నారు. తమకు 773/1, 774 సర్వే నంబర్లలో మొత్తం 1.8 ఎకరాల భూమి ఉండగా కొందరు అక్రమంగా పట్టా చేయించుకున్నారని తెలిపారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తున్నామన్నారు. సవాయి శ్రీనివాస్ అనే వ్యక్తి ఆ భూమి తమదే అంటూ ఆక్రమించుకోవడానికి ఎస్‌కే సోహెల్, గండ్ల రాకేశ్, ఎలుక నాగరాజులతో కలిసి వచ్చి గొడవకు దిగటంతో తాము ప్రతిఘటించామని, తమ కుటుంబంలోని మహిళలు వారిని చెప్పులతో కొట్టి తరిమికొట్టారన్నారు. తమ భూమిపైకి వచ్చిన సవాయి శ్రీనివాస్, అతడితోపాటు వచ్చిన వారు గతంలో తాము పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అనుచరులమని తమను బెదిరించారని, వారు చెప్పిన మాటలు తప్పని తెలియక అనవసరంగా ఎమ్మెల్యేను దుర్భాషలాడామని, తెలియక తప్పు చేసిన తమను క్షమించాలని వేడుకున్నారు.

కరపత్రాల పంపిణీ

వర్ధన్నపేట: మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో 218, 219 బూత్‌ల్లో శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ పోతం మధు ఆధ్వర్యంలో బీజేపీ తొమ్మిదేళ్ల సుపరిపాలనపై కరపత్రాలను ఇంటింటికి వెళ్లి బీజేపీ మండల అధ్యక్షుడు రాయపురం కుమారస్వామి అందించారు. ప్రధాన మంత్రి నాయకత్వంలో గత తొమ్మిదేళ్లుగా దేశంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి అవగాహన కల్పించారు. తాళ్లపెల్లి కృష్ణమూర్తి, కర్ర సోమిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జీపీ రికార్డుల తనిఖీ



దుగ్గొండి : మండలంలోని మర్రిపల్లి గ్రామ పంచాయతీలో పలు రికార్డులను సమాచార హక్కు చట్టం స్టేట్ వైస్ చైర్మన్ చిలువేరు కరుణాకర్ మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీలో రికార్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందన్నారు. నిధుల వివరాల రికార్డులు, పనులకు సంబంధించి బిల్లులు ఏదీ అడిగినా దగ్గర లేవని పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడని తెలిపారు. ఉన్నతాధికారులు వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చెట్టబోయిన విద్యాసాగర్, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్రవణ్, అశోక్‌రావు, మేడిపల్లి సుధాకర్, అనిల్, అమర్, నవీన్, సంజీవయ్య, ప్రదీప్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

రాయపర్తి : మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణానికి చెందిన గట్ల మణిదీప్ జూన్ 4న రాయపర్తి మండలంలోని కొత్తూరు గ్రామానికి ఓ వివాహవేడుకలకు హాజరయ్యాడు. ఈ క్రమంలో తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ క్రమంలో సీఈఐఆర్.జీఓవీ.ఇన్‌ను పోర్టల్ ద్వారా రాయపర్తి పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసినట్లు బాధితుడు తెలిపారు. ఈ క్రమంలో స్థానిక ఎస్సై బండారి రాజు రికవరీ చేసి సెల్‌ఫోన్‌ను మంగళవారం అప్పగించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ తూళ్ల సంతప్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన సర్పంచ్

వర్ధన్నపేట : వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ను మంగళవారం కడారిగూడెం సర్పంచ్ మంద సతీష్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. శాంతిభద్రతలను పరిరక్షించడానికి తనకు సహకరించాలన్నారు. అదేవిధంగా బాల్య వివాహాలను అరికట్టడానికి గ్రామాల్లో యువతను చైతన్యం చేయాలని సూచించారు.

సీబీఐ మాజీ డైరెక్టర్‌ను కలిసిన బాలిరెడ్డి

గీసుకొండ : మండలంలోని మరియపురం సర్పంచ్ అల్లం బాలిరెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో సీబీఐ మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణను మర్యాద పూర్వకంగా కలిశారు. లక్ష్మీనారాయణ మరియపురాన్ని సందర్శించి అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి సర్పంచ్‌ను అభినందించారు.

సర్పంచ్‌కు సన్మానం

రాయపర్తి : మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ ఉత్తమ పంచాయతీగా, ఉత్తమ సర్పంచ్‌గా ఎంపికవడంతో సర్పంచ్ నర్సయ్యను మంగళవారం ఆయా గ్రామాల సర్పంచ్‌లు సన్మానించారు.

షాదీఖానాకు మరమ్మతులు

రాయపర్తి : మండలకేంద్రంలోని షాదీఖానా శిథిలావస్థకు చేరుకోవడంతో మరమ్మతు పనులను ప్రారంభించినట్లు జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి షాదీఖానాను సందర్శించి పరిశీలించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ



వర్ధన్నపేట : రోడ్డు పక్కన నిలిపిన లారీని అదుపు తప్పి మరో లారీ ఢీ కొట్టిన సంఘటన మంగళవారం వర్ధన్నపేటలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. బొగ్గు లోడుతో ఖమ్మం వైపు నుంచి వరంగల్ వైపునకు వెళ్తున్న లారీ వర్ధన్నపేట పోలీస్ స్టేషన్ వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని అతి వేగంతో వచ్చి అదుపు తప్పి మరో లారీ ఢీ కొట్టి 100మీటర్ల దూరంలో ఆగిపోయింది. లారీ నడుపుతున్న డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీ ముందు భాగం నుజ్జునుజ్జయింది.

గొర్రెల మందపై కుక్కల దాడి



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ముత్తోజీపేట గ్రామానికి చెందిన చెల్పూరి సాంబయ్య గ్రామ శివారులోని తన వ్యవసాయ భూమిలో చిన్నపాటి షెడ్డు వేసి గొర్రెలు పెంచుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం భోజనం చేసేందుకు సాంబయ్య ఇంటికి రాగా షెడ్డులోకి ఐదు కుక్కలు వెళ్లి గొర్రెల మందపై దాడి చేశాయి. ఈదాడిలో 10గొర్రెలకు మృతిచెందగా మరో 10గొర్రెలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే పశువైద్యాధికారులకు సమాచారం అందించడంతో వచ్చి చికిత్స అందించారు. దీంతో బాధితుడికి రూ. 2లక్షల నష్టవాటిల్లిందని బాధితుడు రోదిస్తూ తెలిపారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

ఏఐసీసీ సభ్యుడు దొంతి మాధవరెడ్డి



మాట్లాడుతున్న దొంతి మాధవరెడ్డి

నెక్కొండ : కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తోందని, పార్టీ కార్యకర్తలు కష్టపడి పని చేస్తే వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఏఐసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని చంద్రుగొండ. గొల్లపల్లి, బంజరుపల్లి గ్రామాల్లో సోమవారం రాత్రి దొంతి మాధవరెడ్డి హాథ్ సే హాథ్ జోడో యాత్ర చేపట్టారు. పాదయాత్రకు జై కొడుతూ.. పెద్ద సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు తరలివచ్చారు. దొంతికి మహిళలు మంగళహారతులతో స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేకూరే సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. అవినీతిలో నిండా కూరుకుపోయిన కేసీఆర్ తన కుటుంబాన్ని కాపాడుకోవడానికి బీజేపీకి లొంగిపోయారని ఆయన ఆరోపించారు. సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, బక్కి కవిత, రావుల హరీష్‌రెడ్డి, బక్కి అశోక్, బానోతు లక్ష్మణ్‌నాయక్, పాల్వాయి శ్రీనివాస్, వేముల సాంబయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించాలి



మాట్లాడుతున్న అఖిలపక్షం నాయకులు

వర్ధన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం రెండో విడతగా మంజూరు చేసే దళిత బంధు పథకం దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా స్వీకరించాలని అఖిలపక్షం నాయకులు నరుకుడు వెంకటయ్య, జక్కి శ్రీకాంత్, వల్లందాసు కుమార్, ఈరెల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం వర్ధన్నపేటలో వారు విలేకరులతో మాట్లాడుతూ దళిత బంధు దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా స్వీకరించడంతో పాటు గ్రామసభలను ఏర్పాటు చేసి లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. బీసీ కులాలకు రూ. లక్ష మంజూరు కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం దళితబంధు దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా ఎందుకు స్వీకరించడం లేదని ప్రశ్నించారు. గతంలోనే దళితులు ఎవరికి ఇవ్వాలో తెలియక అయోమయానికి గురయ్యారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగించాలన్నారు. గతంలో దళితబంధు లబ్ధిదారుల ఎంపికలో రాజకీయంగా, ప్రజాప్రతినిధులు ప్రమేయం ఉన్నందు వల్ల 30 శాతం కమీషన్ ఎమ్మెల్యే తీసుకున్నారని స్వయంగా సీఎం కేసీఆర్ మంత్రివర్గ సమావేశంలో ప్రకటించినప్పటికి మరోమారు దళిత బంధు లబ్ధిదారుల ఎంపిక విధానం పాత పద్ధతిలోనే కొనసాగించడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. ఈనెల 30న అఖిలపక్షం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన తెలుపుతామన్నారు. సమావేశంలో వెంకటేశ్వర్‌రావు, మల్లెపాక సమ్మయ్య, కనుగుర్తి ఉపేందర్, ఎలికట్టె ప్రభాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి



ప్రశంసపత్రాలు అందజేస్తున్న మేనేజర్ మనోజ్

చెన్నారావుపేట : విద్యార్థులు చదువులో రాణించాలని ఎస్‌బీఐ మేనేజర్ మనోజ్ తెలిపారు. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జీ–20 సదస్సు ద్వారా ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించడానికి క్విజ్ పోటీలను సిద్దార్థ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఉప్పరపల్లి హైస్కూల్ విద్యార్థులు చెలకపల్లి సిద్దార్థ, వెల్దె ఆకాష్ ప్రథమ బహుమతి రూ.5 వేలు, జల్లి హైస్కూల్ విద్యార్థులు రాహుల్, చరణ్‌లు ద్వితీయ బహుమతి రూ.4 వేలు, లింగాపురం హైస్కూల్ విద్యార్థులు సుశ్మిత, వినయ్ తృతీయ బహుమతి రూ.3 వేలతో పాటు ప్రశంసపత్రం అందుకున్నారు. జూలై 4న వరంగల్‌లో నిర్వహించే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ప్రసన్న, నరేష్, ఆమంచ రవికుమార్, అశోక్, సీహెచ్ పరమేశ్వర్, హవేలీ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై పోటీలు

సంగెం : ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని స్థానిక యూనియన్ బ్యాంకు మేనేజర్ యాకర అనిల్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఆర్‌బీఐ వారి సౌజన్యంతో విద్యార్థులకు జిల్లా స్థాయిలో ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి జెడ్పీహెచ్ఎస్ శివనగర్, జెడ్పీహెచ్ఎస్ సంగెం ద్వితీయ బహుమతి అందుకున్నారు. పోటీలో పాల్గొన్న విద్యార్థులందరికి పరీక్ష ప్యాడ్‌లు, పెన్‌లు అందజేశారు. లీడ్ బ్యాంకు మేనేజర్ రాజు, ప్రధానోపాధ్యాయుడు రవీందర్ పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధిని సాధించాలి

రాయపర్తి : బ్యాంక్ అందించే సేవలతో ఆర్థికాభివృద్ధిని సాధించాలని రాయపర్తి ఎస్‌బీఐ మేనేజర్ సురేష్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు రావుల భాస్కర్‌రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై మండలస్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతను పాటించాలన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, గాదె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో సౌకర్యాలు కరువు



కోడిగుడ్ల ట్రేతో విసురుతున్న అంగన్‌వాడీ టీచర్

సంగెం : రోజంతా చిన్నారులు, పౌష్టికాహారం కోసం గర్భిణులు, బాలింతలు వచ్చిపోయే అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. మండలంలోని బీకోజీ నాయక్ తండాలోని అంగన్‌వాడీ కేంద్రం కాస్త అంగన్‌వేడి కేంద్రంగా మారింది. వేసవి కాలంలో ఉక్కపోతకు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు చెమట కక్కుతూ వెళ్లదీస్తున్నారు. వానలు ఆలస్యం కావడంతో ఇంకా ఉక్కపోత తగ్గలేదు. దీంతో అంగన్‌వాడీ కేంద్రంలో ఫ్యాన్ లేక అవస్థలు తప్పడం లేదు. కాస్తనైనా పిల్లలకు చల్లని గాలి అందించాలనే తాపత్రాయంలో అంగన్‌వాడీ టీచర్ కోడిగుడ్ల ట్రేతో విసురుతూ చిన్నారులను నిద్రపుచ్చుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రంలో ఫ్యాన్ ఏర్పాటు చేయాలని బీజేపీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు సపావట్ మహేందర్‌తో పాటుగా పలువురు డిమాండ్ చేస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

దళితబంధు ప్రవేశపెట్టడం హర్షణీయం



నర్సంపేట : రాష్ట్రంలో దళితుల అభివృద్ధి, సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ దళితబంధు పథకం ప్రవేశపెట్టి ఇచ్చిన మాట అమలు చేయడం హర్షణీయమని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు సాధు నర్సింగరావు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం మాల మహానాడు జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల సాధికారత కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ దళితబంధు లాంటి బృహత్తర కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. మొదటి విడత దళితబంధు పథకంలో నియోజకవర్గానికి వంద మందికి, ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రతి నియోజకవర్గానికి 1,100మంది దళిత లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.10లక్షలు ఇవ్వడం చారిత్రకమైన అంశమన్నారు. ఈ కార్యక్రమంలో కోతి విష్ణు, కున్నామల్ల కమలాకర్, శీలం శంకర్, పత్రి కుమార్, కడగండ్ల అశోక్‌రావు, పడిదం రాజేందర్, మండల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణా కేంద్రాలు ప్రారంభం

రాయపర్తి : మండలంలోని పెర్కవేడు, రాయపర్తి, కొత్తూరు, కాట్రపల్లి, తిర్మలాయపల్లిలో ఏర్పాటు చేసిన కుట్టుశిక్షణ కేంద్రాలను ఎర్రబెల్లి దయాకర్ రావు ట్రస్ట్ పాలకుర్తి నియోజకవర్గ కోఆర్డినేటర్ పంజా కల్పన ప్రారంభించారు. కాగా మంగళవారం గ్రామాల్లోని కుట్టుశిక్షణ కేంద్రాలను సందర్శించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

రాయపర్తి : మండలకేంద్రంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎనగందుల రత్నాకర్, ఉపాధ్యక్షుడిగా ఎనగందుల మహేందర్, కార్యదర్శిగా ఎనగందుల చిన్నకుమారస్వామి, కోశాధికారిగా కొత్తపల్లి లింగయ్య, ప్రధాన సలహాదారులుగా ఎనగందుల శ్యాంసుందర్, ఎనగందుల యాదగిరి, యాకయ్య, గౌరవ అధ్యక్షుడిగా ఎనగందుల మల్లయ్య, కార్యవర్గ సభ్యులుగా కుమారస్వామి, సదానందం, ప్రవీణ్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

మొక్కలు నాటారు..



ఖానాపురం : మండలంలోని కొత్తూరు గ్రామ శివారులో కోరెందుల కుంట సమీపంలో హరిత హారంలో భాగంగా నాటిన మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. దీంతో స్పందించిన అధికారులు మొక్కలు తొలగించిన వ్యక్తులను గుర్తించారు. మొక్కలు తొలగించిన గ్రామానికి చెందిన భూస అశోక్‌కు నోటీసులు జారీ చేశారు. నోటీసులకు స్పందించిన సంబంధిత వ్యక్తి గ్రామ శివారులో మంగళవారం 20 మొక్కలను పంచాయతీ కార్యదర్శి శ్రవంతి ఆధ్వర్యంలో నాటారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

వర్ధన్నపేట : వర్ధన్నపేటకు చెందిన బక్కతట్ల ఎల్లమ్మ(80) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. ఈ సమాచారం అందుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కొండేటి సత్యం, చీటూరి రాజు, విక్రమ్ తదితరులు ఉన్నారు.

బూర్గుమళ్లలో..

పర్వతగిరి : మండలంలోని బూర్గుమళ్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు చింతల శ్రీనివాస్‌గౌడ్‌ను మంగళవారం ఏఎంసీ డైరెక్టర్ పట్టాపురం ఏకాంతంగౌడ్, రైతు విభాగం మండల అధ్యక్షుడు బల్లే వెంకటరాజుగౌడ్, ఐనవోలు దేవస్థానం డైరెక్టర్ బండి సాయిలు, అబ్బపురి వెంకటేశ్వర్లు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

పర్వతగిరి : కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయిలో బలోపేతం చేసేందుకు గ్రామ పార్టీ అధ్యక్షులు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో గ్రామ పార్టీ అధ్యక్షుల సమావేశం మంగళవారం నిర్వహించారు.